కాబట్టే...ప్రదేశ కాంగ్రెసధ్యక్షులన్నట్టు దుగ్గిరాల నియోజకవర్గంలో హరిజనుల ఓట్లు అనుకున్నన్ని కాంగ్రెసుకు రాలేదు...రాబోయే ఎన్నికల్లో రానూరావు. హరిజన హాస్టలును ప్రభుత్వం నిర్వహించాలని, ప్రైవేటు వ్యక్తులు నడుపరాదని అనేకమంది ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయినా ఆ సంప్రదాయం పోలేదు...హరిజన విద్యార్థికి ప్రభుత్వమిచ్చే సహాయాన్ని మూడువంతులు పైవారే ఆరగించడంవల్ల హరిజనులకు ప్రభుత్వంపై కలిగే సానుభూతి ఎటువంటిదై ఉంటుంది? అజ్ఞానానందగారు పడకకుర్చీలో గుర్రుమన్నారు. అంతలో ఆయననిద్రపోగలడు కాబట్టే స్వామీజీ అయాడనుకున్నాను...బావతో...అన్నాను... తెలుగువాడు తీర్మానాలు చేయడంలోమేటి... గాలిమేడలు కట్టడంలో గట్టివాడు...ఆచరణలో అందరికీ వెనుక... కాబట్టే... జవసత్తువలులేని ప్రభుత్వం చాలకాలం మన్నింది. అనుకున్న ప్రాజెక్టులు ద్వితీయ పంచవర్ష ప్రణాళికలోగాని రూపాన్ని అందవు...మద్యనిషేధం....మరియొక మంత్రివర్గంచేతగాని కట్టుదిట్టం చేయబడగనే సూచనలున్నాయి. వర్తమానప్రభుత్వం తప్పుచేసి దిద్దుకుంటూనే ఉంటుంది...ఐనా... గోపాలరెడ్డిగారు కాంగ్రెసును బలంచేయడానికి ముగ్గురు మూర్తులనూ కాంగ్రెసులోకి ఆహ్వానించారు... ఆనోటితో రంగాగారినికూడా ఆహ్వానిస్తే... ఎట్లా ఉండేదో...

ఇంతలో...భీమేశ్వరరావుగారు దభీమనిలేచి ఏమండోయ్...విన్నారా! టెన్సింగు స్విట్జర్లాండులో పర్వతారోహణశిక్షకుడుగా ట్రయినింగయినాడట...వచ్చేస్తాడు...మనదేశంలో లక్షమందైనా టెన్సింగులు తయారవాలి...దేవుడిదయెలావుందో... అన్నాడు గట్టిగా...నాకు ఆ సాయంకాలం నవ్వువస్తూనేవుంది ఆయన క్రీడాసక్తికి.

---

గల్పిక

# బ్రోకరు శేఖరు

నిడదవోలు మాలతి

"ఫీజు కట్టడానికి అర్థరూపాయి తక్కువొచ్చింది. కొంచెం నీదగ్గిరుంటే ఇద్దూ, మళ్ళీ రేపిచ్చేస్తాను" అన్నాడు శేఖర్ బ్రతిమాలే స్వరంతో.

"అర్థరూపాయే? నాదగ్గిర లేదే" అన్నాడు గోపీ తన నిస్సహాయతని వెల్లడిచేస్తూ.

"ఇహ ఇవాళ పేరుకొట్టేస్తారు."

శేఖర్‌కి దాదాపు ఏడుపొస్తోంది. "మీ అన్నయ్యని అడిగితేనో?"

"అన్నయ్యా? తన్నకుండా ఉంటేచాలు, ఇచ్చినంత. నీహాబీ ఉండనేఉందికదా బ్రోకరేజి" అన్నాడు గోపీ.

"ఏం పెట్టి బ్రోకరేజి?" అన్నాడు శేఖర్ నిస్పృహగా. గోపీ తప్పకుండా సాయంచేస్తాడనుకున్నాడు.

ఏలాగైనా సాయంచెయ్యాలనుకున్నాడు గోపీ. "ఉండు, అడిగిచూస్తాను నాన్నగారిని" అంటూ లోపలికి వెళ్ళిన గోపీ అట్టేకాలం వ్యర్థం అవకుండానే దవడ తడుముకుంటూ వచ్చాడు. మొహంచూసి వెళ్ళిపోబోతున్న శేఖర్ని ఆపి గోపీ, "ఇంద" అంటూ మబ్బురంగు పెన్ను ఇచ్చాడు. ఉద్దేశం గ్రహించిన శేఖర్, "మీ నాన్నగారికి తెలిస్తే?" అన్నాడు భయంగా.

"ఫరవాలేదులే. పోయిందని పొద్దున్నే చెప్పేశాను. ఇంకోటి తెస్తానన్నారు" అన్నాడు గోపీ.

* * *

ఆ సాయంత్రం గోపీ తండ్రి "ఇదుగో ఇదైనా జాగ్రత్తగా వాడుకో" అంటూ మబ్బురంగు కలం చేతులో పెడుతూంటే నిర్ఘాంతపోయాడు.

* * *

మర్నాడు శేఖర్ని. నువ్వు పెన్ను ఎవరికి అమ్మావురా?" అని గోపీ అడిగేసరికి శేఖర్ తెల్లబోతూ "ఎక్స్క్యూజ్ మీ, మీ నాన్నగారని తెలీలేదురా" అన్నాడు.

గోపీ నవ్వి "ఫరవాలేదులే. మరి తిన్నగా అడిగితే ఇవ్వకపోతే ఏం చెయ్యాలి?" అన్నాడు.